

లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ మంజూరు పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు

సీఎంఆర్ఎఫ్‌ను పేదలు సద్వినియోగం చేసుకోవాలి

● ఎమ్మెల్యే కృష్ణారావు

కూకట్‌పల్లి, మార్చి 27(ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి నియోజవర్గంలోని పేద ప్రజలు సీఎం సహాయ నిధిని సద్వినియోగం చేసుకోవాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. వైద్య ఖర్చుల నిమిత్తం అల్లాపూర్ డివిజన్‌కు చెందిన బండారు సూర్యప్రకాశ్‌కు రూ. లక్ష, మహ్మద్ పీర్ అహ్మద్‌కు రూ.2 లక్షలు మంజూరయ్యాయి. ఇందుకు సంబంధించిన ఎల్ఓసీ పత్రాలను గురువారం ఎమ్మెల్యే కృష్ణారావు తన క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో కూకట్‌పల్లి కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణరావు తదితరులు పాల్గొన్నారు.



పార్కు గేటు ముందు చెత్తను తొలగించి బ్లీచింగ్ పౌడర్ చల్లిన దృశ్యం

పార్కు వద్ద చెత్తాచెదారం తొలగింపు

కేపీహెచ్‌బీకాలనీ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): బతుకమ్మ కుంట పార్కు ప్రవేశ ద్వారం వద్ద పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని పారిశుధ్య కార్మికులు గురువారం తొలగించారు. "పార్కు ముందు చెత్తను తొలగించరూ!" అనే శీర్షికతో ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి మూసాపేట సర్కిల్ అధికారులు స్పందించారు. స్థానిక ఎస్ఎఫ్ఏ మహంకాళి సూర్య నారాయణ అక్కడకు చేరుకొని చెత్తాచెదారం, వ్యర్థాలను తొలగింప జేసి బ్లీచింగ్ పౌడర్ చల్లించారు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



ఎన్నికలు జరుగుతున్న ప్రాంతంలో న్యాయవాదుల ఆత్మీయ పలకరింపులు

ఉత్కంఠభరితంగా బార్ అసోసియేషన్ ఎన్నికలు

కేపీహెచ్‌బీకాలనీ, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : కూకట్‌పల్లి కోర్టు బార్ అసోసియేషన్ ఎన్నికలు గురువారం ఉత్కంఠ బరితంగా సాగాయి. ఉదయం 10.30 నుంచి 4.30 గంటల వరకు పోలింగ్ జరగ్గా.. మొత్తం 720 ఓటర్లకు గాను 643 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు.ఉదయం 7గంటల నుంచే కోర్టు ప్రాంగణంలో పోటీలో ఉన్న అభ్యర్థులు తోటి న్యాయవాదులను మచ్చిక చేసుకునేందుకు పడరాని పాట్లు పడ్డారు. 15 పోస్టులకు 36 మంది పోటీలో ఉన్నప్పటికీ గెలుస్తాం అనే వారు మాత్రం ఇగోలను కాస్త పక్కనపెట్టి మరీ ఓటింగ్‌కు వచ్చే వారిని ఆప్యాయంగా పలుకరించి తమవైపు తిప్పుకునే ప్రయత్నాలు చేశారు.



అబ్రార్‌నగర్‌లో జరిగిన ఇఫ్తార్ విందులో పాల్గొన్న కార్పొరేటర్ నర్సింహయాదవ్ తదితరులు

ఇఫ్తార్ విందుల్లో పాల్గొన్న కార్పొరేటర్లు

ఓల్డుబోయినపల్లి, మార్చి 27(ఆంధ్రజ్యోతి): రంజాన్ పవిత్ర మాసం సందర్భంగా ఓల్డుబోయినపల్లిలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుల్లో కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు. హస్మత్‌పేట అబ్రార్‌నగర్ మసీద్‌లో నియోజకవర్గ మైనారిటీ అధ్యక్షుడు సయ్యద్ ఎజాజ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో పాల్గొని పండ్లు తినిపించి ఉపవాస దీక్షను విరమింప చేశారు. అనంతరం అల్లాపూర్ కార్పొరేటర్ సబీహ బేగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకుడు కర్రెజంగయ్య, ఇర్ఫాన్, హరినాథ్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



ఫతేనగర్ డివిజన్ ప్రభాకర్‌రెడ్డినగర్‌లో మసీద్ పెద్దల ఆధ్వర్యంలో గురువారం రాత్రి నిర్వహించిన ఇఫ్తార్ విందులో పాల్గొన్న కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్ తదితరులు

రోడ్డుపై బోరు వేయడంతో ఇబ్బందులు

హైదర్‌నగర్, మార్చి 27 (ఆంధ్రజోతి): కూకట్‌పల్లి వెంకటేశ్వరనగర్ బ్లాక్-3ఏస్‌లో బస్తీదవాఖానాకు వెళ్లే దారిలో శేఖర్‌అనే వ్యక్తి రోడ్డుపై ఆరు ఇంచుల బోర్ వేయడంతో దవాఖానాకు వెళ్లే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని కాలనీ అధ్యక్షుడు లక్ష్మణ్ స్థానికులతో కలిసి తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేశాడు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మియాపూర్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన మియాపూర్ బొల్లారం రోడ్డులో గురువారం రాత్రి జరిగింది. మియాపూర్ ఆదిత్యనగర్‌కు చెందిన అరుణ్ రషీద్(40) పని నిమిత్తం బైక్ మీద బాచుపల్లి వెళ్లి తిరిగి వస్తుండగా మియాపూర్ బొల్లారం రోడ్డులో కోకాకోలా సమీపంలో బైక్ డివైడర్‌కు ఢీ కొని కిందపడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. ప్రమాదం ఎలా జరిగిందనే అంశంపై స్పష్టత లేదని, ఈ ప్రాంతంలో ఉన్న సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నామని, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ఆగిన బతుకమ్మ ట్యాంకు నిర్మాణం

● అర్ధాంతరంగా పనులు నిలిపివేసిన హైడ్రా

● నల్లచెరువు సుందరీకరణపై రేకెత్తుతున్న అనుమానాలు

కూకట్‌పల్లి, మార్చి 27(ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి పరిధిలో ఉన్న నల్లచెరువు సుందరీకరణ పనుల్లో భాగంగా చేపట్టిన బతుకమ్మ ట్యాంకు నిర్మాణ పనులు అర్ధాంతరం నిలిచిపోయాయి. దీంతో చెరువు సుందరీకరణ జరిగేనా అనే అనుమానాలు స్థానికంగా వ్యక్తమవుతున్నాయి. హైడ్రా అధికారుల పర్యవేక్షణలో కొద్ది రోజులుగా నల్లచెరువు అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ఇరిగేషన్, రెవెన్యూ, జీహెచ్ఎంసీ అధికారుల సమన్వయంతో 15 రోజులుగా చెరువులో పూడిక తీసి నీటిని బయటకు తోడేస్తున్నారు. చెరువు పార్కు గేటు సమీపంలో బతుకమ్మ ట్యాంకు నిర్మాణం, శేషాద్రినగర్ వైపు నుంచి వచ్చే వరదనీరు చెరువులోకి వెళ్లేలా కాలువ పనులను కూడా చేపట్టారు. ప్రస్తుం సెంట్రింగ్ పనులు జరుగుతున్నాయి. అయితే, గురువారం అకస్మాత్తుగా ట్యాంకు పనులను ఆపివేశారు. పనులను నిలిపివేయడంపై కార్పొరేటర్ జూపల్లి అధికారులను వివరణ కోరగా, హైడ్రా అధికారుల ఆదేశాల మేరకు పనులను నిలిపివేసినట్లు తెలిపారు.



నల్లచెరువులో ఆగిన బతుకమ్మ ట్యాంకు పనులు

పూడిక తీత పూర్తయ్యాక తిరిగి ప్రారంభిస్తాం

హైడ్రా పర్యవేక్షణలో నల్లచెరువు సుందరీకరణ పనులు జరుగుతున్నాయి, చెరువులో పూడిక తీత పనులు పూర్తయ్యాక హైడ్రా అధికారుల అనుమతితో బతుకమ్మ ట్యాంకు నిర్మాణ పనులను తిరిగి ప్రారంభిస్తాం.

\- గోవర్ధన్, ఈఈ, కూకట్‌పల్లి

సమాచారం ఇవ్వడం లేదు

● కూకట్‌పల్లి కార్పొరేటర్ సత్యనారాయణ రావు



కూకట్‌పల్లి, మార్చి 27(ఆంధ్రజ్యోతి): చెరువులను అభివృద్ధి చేస్తున్న హైడ్రా అధికారులు ఈ పనుల గురించి స్థానిక ప్రజాప్రతినిధులకు ఎలాంటి సమాచారం ఇవ్వడం లేదని కూకట్‌పల్లి కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణరావు ఆరోపించారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, నల్లచెరువు సుందరీకరణకు తమ సంపూర్ణ సహకారం ఉంటుందని,ఈ విషయంలో అధికారులకు తమ సలహాలు, సూచనలు అందిస్తామన్నారు. చెరువు ప్రాంతంలోని పట్టాదారులకు కూడా అన్యాయం జరగరాదని, వారికి కూడా టీడీఆర్ విషయంలో స్పష్టత ఇవ్వాలన్నారు. మరోవైపు చెరువు సుందరీకరణ ఎలా చేస్తున్నారు.పిల్లలకు ఆటస్థలం, వాకింగ్‌ట్రాక్, ఆక్సిజన్ పార్కు వంటి వి ఏర్పాటు చేస్తున్నారా అనే విషయాలపై తమకు ఎలాంటి సమాచారం ఇవ్వడం లేద న్నారు. కూకట్‌పల్లిలోని పలు కాలనీల మహిళలు నల్లచెరువు వద్ద బతుకమ్మ ఆడి, ఆ తర్వాత చెరువులో బతుకమ్మలను నిమజ్జనం చేస్తారన్నారు. బతుకమ్మ ట్యాంకు నిర్మాణ పనులను అధికారులు ఒక్కసారిగా ఎందుకు ఆపేశారో తెలియడం లేదన్నారు. నల్లచెరువు సుందరీకరణ పనులపై స్పష్టత కోసం శుక్రవారం హైడ్రా అధికారులను కలుస్తానని కార్పొరేటర్ తెలిపారు.



రక్తదానం చేస్తున్న వారిని అభినందిస్తున్న కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు

రక్తదాతలకు కార్పొరేటర్ అభినందనలు

కేపీహెచ్‌బీకాలనీ, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): రక్తం దానం చేయడమంటే ఆపదలో ఉన్న మరొకరి ప్రాణం కాపాడినట్లేనని కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు అన్నారు. కేపీహెచ్‌బీ 3వ ఫేజ్ పోచమ్మతల్లి ఆలయ ప్రాంగణంలో గురువారం సినీనటుడు రామ్‌చరణ్ పుట్టిన రోజు సందర్భంగా ఆలిండియా రామ్‌చరణ్ ఫ్యాన్స్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. యువత పెద్ద సంఖ్యలో హాజరై రక్తదానం చేశారు. కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు బ్లడ్ డొనేషన్ క్యాంపును సందర్శించి రక్తం ఇచ్చేన వారిని అభినందించారు. కార్యక్రమంలో నిర్వాహకులు సందీప్ ధనపాల, అరవింద్ చెర్రీ, ఆలయ కమిటీ సభ్యులు నూతి రాంబాబు నాయుడు, బుట్టో రాంబాబు నాయుడు, బీఎస్ఎన్ రాజు పాల్గొన్నారు.

రైతుబజార్‌లో కూరగాయల ధరలు

కేపీహెచ్‌బీకాలనీ, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : కూకట్‌పల్లి రైతుబజార్‌లో కూరగాయల ధరలు (కిలో రూపాయల్లో) ఇలా ఉన్నాయి. టమోటా 11, వంకాయ 18, బెండ 38, పచ్చిమిర్చి 35, బజ్జీ మిర్చి 28, కాకర 35, బీర 40, క్యాబేజీ 10, బీన్స్ 45, క్యారెట్ 18, గోబీ 18, దొండ 35, చిక్కుడు 55, గోరు చిక్కుడు 35, బీట్‌రూట్ 15, క్యాప్సికం 35, ఆలు 23, కీర 15, దోస 18, సొర 15, పొట 18, కంద 65, ఉల్లి 24, చిలగడ దుంప 30. ఈ ధరలు శుక్రవారం ఉదయం 9.30 గంటల వరకు మాత్రమే అందుబాటులో ఉంటాయి.

జల్సాల కోసం చోరీల బాట

● యువకుడిని అరెస్టు చేసిన కేపీహెచ్‌బీ పోలీసులు

● 6 ల్యాప్‌టాప్‌లు, 2 సెల్‌ఫోన్లు స్వాధీనం

హైదర్‌నగర్, మార్చి27 (ఆంధ్రజ్యోతి): విలాసవంతంగా గడిపేందుకు చోరీలు బాటపట్టిన ఓ యువకుడిని కేపీహెచ్‌బీ పోలీసులు అరెస్టు చేశారు. గురువారం కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్‌లో కూకట్‌పల్లి ఏసీపీ కె.శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం... తమిళనాడు రాష్ట్రం వెల్లూర్‌కు చెందిన జీవ గణేషన్ అలియాస్ గణేష్(26) సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరులో నివాసముంటూ మేస్త్రీ పని చేసేవాడు. ఈ క్రమంలో గణేష్‌కు కుమార్ అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. మేస్త్రీగా ఎంతకాలం కష్టపడతావు, సులభంగా డబ్బు సంపాదించి విలాసవంతంగా జీవించవచ్చని గణేష్‌తో నమ్మబలికిన కుమార్ అతడిని ముంబైకి తీసుకెళ్లాడు. అక్కడ ల్యాప్‌టాప్‌లు ఎలా దొంగతనం చేయాలో గణేష్‌కు కుమార్ నేర్పించాడు. ఇద్దరూ కలిసి దొంగిలించిన ల్యాప్‌టాప్‌లు రాజేందర్ అనే వ్యక్తికి తక్కువ ధర కు విక్రయించి సొమ్ము చేసుకుని వచ్చిన డబ్బుతో జల్సాలు చేసేవారు. హైదరాబాద్‌లో ఇదే విధంగా చోరీలు చేయాలని నిర్ణయించుకున్న గణేష్ ముంబై నుంచి వెనక్కి వచ్చేశాడు. గతేడాది మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నాలుగు ల్యాప్‌టాప్‌లు, సెల్‌ఫోన్ దొంగిలించాడు. వారంరోజుల క్రితం కేపీహెచ్‌బీ, కూకట్‌పల్లి పోలీసు స్టేషన్ల పరిధిలో రోజుల వ్యవధిలో ఆరు ల్యాప్‌టాప్‌లు చోరీ జరిగినట్లు పోలీసులకు ఫిర్యాదులందాయి. విచారణ చేపట్టిన కేపీహెచ్‌బీ పోలీసులు, సీసీఎస్ పోలీసుల సహకారంతో కేపీహెచ్‌బీ కాలనీలో ఓ ఇంటి వద్ద రెక్కీ నిర్వహిస్తున్న గణేష్‌ను అదుపులోకి తీసుకొని విచారించారు. అతడి వద్ద నుంచి ఆరు ల్యాప్‌టాప్‌లు, రెండు సెల్‌ఫోన్లు రికవరీ చేశారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ శ్రీనివాసరావు, (ఇన్‌సెట్‌లో) నిందితుడు గణేష్

సీజ్డ్ భవనాలు తెరుచుకునే వేళాయె?

● విన్నపాలు ఆలకిస్తే.. నిర్మాణ దారులకు ఊరట దక్కినట్లే

● జీహెచ్ఎంసీ కమిషనర్‌కు కూకట్‌పల్లి జెడ్సీ లేఖ

● బల్దియా బాస్ నిర్ణయం కోసం నిర్మాణదారుల ఎదురు చూపులు

కేపీహెచ్‌బీకాలనీ, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): అక్రమ భవన నిర్మాణదారులకు ఊరట దక్కేనా? నిబంధనలు పాటించకుండా నిర్మించిన పేక మేడలు సక్రమం కానున్నాయా? నోటీస్ లు.. సీజ్ అంటూ చేసిన హడావుడి అంతా కాగితాలకే పరిమితమా? జీహెచ్ఎంసీ కూకట్‌పల్లి జోన్ పరిధిలో అక్రమ నిర్మాణదారులు పడుతున్న హైరానాకు తెర దించేలా జడ్సీ వ్యవహరిస్తున్నారా ఇప్పుడు ఇదే టాపిక్ ఎక్కడ ఏ ఇద్దరు అధికారులు కలిసినా చర్చికుంటున్నారు.

● ఈనెల మొదటి వారంలో కుత్బుల్లాపూర్ సర్కిల్‌కు చెందిన ఓ సీజ్ భవనం గురించి తుది నిర్ణయం కోసం జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తికి నోట్ ఫైల్ పంపించినట్లు సమాచారం. ఈ విషయం తెలుసుకున్న ఇతర నిర్మాణదారులు బల్దియా బాస్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటారోనని టౌన్‌ప్లానింగ్ సర్కిల్, జోనల్ అధికారులను ఆరా తీస్తున్నారు.

మమ్మల్ని బయట పడేయండి సారూ..

కూకట్‌పల్లి జోనల్ పరిధిలో అక్రమ నిర్మాణాలు పెద్ద సంఖ్యలో ఉన్నాయి. మూసాపేట, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, గాజులరామారం, అల్వాల్ సర్కిళ్ల పరిధిలో తీసుకున్న అనుమతులకు విరుద్ధంగా పేక మేడల్లా ఇళ్లు నిర్మించారు. గతంలో పనిచేసిన టీపీఎస్, టౌన్‌ప్లానింగ్ ఏసీపీ అండ దండలతోనే తాము ఈ నిర్మాణాలు చేపట్టామని డిప్యూటీ కమిషనర్లు, జోనల్ టౌన్‌ప్లానింగ్ అధికారుల వద్ద అక్రమ నిర్మాణదారులు తమ గోడు వెల్లబోసుకుంటున్నారు. మీరు మమ్మల్ని ఎలాగైనా ఈ గండం నుంచి బయట పడేయాలని పదుల సంఖ్యలో నిర్మాణదారులు అధికారులకు విజ్ఞప్తులు అందజేశారు. త్వరిత గతిన నిర్మాణాలు చేసుకోకపోతే ఆర్థికంగా నష్టపోతామని, కావాలంటే మరోసారి ఎంతో కొంత ఇచ్చుకుంటాం, త్వరితగతిన తాము బయట పడే మార్గం చూపాలని కోరుతున్నారట. దీంతో సర్కిల్ పరిధిలో చేయిదాటి పోవడంతో జోనల్ కమిషనర్‌కు విజ్ఞప్తుల పర్వం కొనసాగుతోంది.

● జెడ్సీ ఐఏఎస్ అధికారి కావడంతో ఆయన నోట్‌ఫైల్‌ను పంపి తుది నిర్ణయం జీహెచ్ఎంసీ కమిషనర్‌పై ఉంచారని అధికారులు అంటున్నారు.



మూసాపేట సర్కిల్ పరిధిలో సీజ్ చేసిన ఓ భవనం

రెండు నెలలుగా భవన నిర్మాణదారులకు కంటిమీద కునుకు లేకుండా చేసిన అధికారులు.. తాజాగా వారికి లబ్ధి చేకూరేలా నిర్ణయం తీసుకుంటున్నారా అనే చర్చ జరుగుతోంది. గతంలో అక్రమ నిర్మాణ దారులపై పోలీస్ స్టేషన్‌లో కేసులు కూడా నమోదయ్యాయి. మూసాపేట సర్కిల్‌లో అయితే ఒకే భవనాన్ని రెండు సార్లు సీజ్ చేసి అక్రమ నిర్మాణ దారుల్లో భయం పుట్టించారు. అంత కఠినంగా ఉన్న అధికారుల్లో అంతలోనే ఎంత మార్పు ఎలా వచ్చిందో తెలియడం లేదని కూకట్‌పల్లి, మూసాపేట సర్కిళ్ల పరిధిలోని ప్రజలు చర్చించుకుంటున్నారు.

అక్కడ ఓకే అంటేనే ?

తాజాగా అధికారులపై ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకుల నుంచి ఒత్తిళ్లు అధికమైనట్లు తెలుస్తోంది. దీంతో అధికారులు మేము స్వయంగా సీజ్ చేయడం లేదు. కాలనీ అసోసియేషన్లు, స్వచ్ఛంద సంస్థలు, ఆర్టీఐ ద్వారా వచ్చే వాటిని దృష్టిలో పెట్టుకుంటున్నామని చెబుతున్నారు. మీరు కావాలంటే మాపై ఒత్తిడి తెచ్చే ఫిర్యాదుదారులతో మాట్లాడుకోండి. వారి నుంచి మాకు ఒత్తిడి లేకపోతే మేము ఎందుకు సీజ్ చేస్తాం. ఇక ఇప్పటికే ఒకట్రెండు సార్లు సీజ్ చేసిన భవనాలను మేము తెరిపించలేం' అని డీసీ, టౌన్‌ప్లానింగ్ అధికారులు అంటున్నారని తెలిసింది.

కూకట్‌పల్లిలోనే ఎందుకు ఇలా ?

కూకట్‌పల్లి నియోజకవర్గ పరిధిలోనే ఎక్కువగా అక్రమ నిర్మాణాలు నిర్మించారు. తెలుగు రాష్ట్రాలతో పాటు దేశ వ్యాప్తంగా ఉన్న అన్నీ రాష్ట్రాల ప్రజలు నివాసం కూకట్‌పల్లి నియోజకవర్గంలోనే ఉంటున్నారు. ఇక్కడ వసతి గృహాలు, అద్దెల కోసం పేక మేడలు నిర్మించారు. 66, 111, 125 గజాల్లో కూడా జీ ప్లస్ 6,7,8 ఫ్లోర్లు నిర్మించారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఇక్కడి కార్పొరేటర్లతో పాటు ఎమ్మెల్యేపై కూడా భవన నిర్మాణదారులు మాకు మార్గం చూపాలని వేడుకుంటున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండటం, ఇక్కడ బీఆర్ఎస్ కార్పొరేటర్లు, బీఆర్ఎస్ ఎమ్మెల్యే ఉండటంతో అధికారులు కూడా పెద్దగా పట్టించుకోవడం లేదన్న వాదనలు వినిపిస్తున్నాయి. నిర్మాణదారుల నుంచి వస్తున్న విజ్ఞప్తులను దృష్టిలో పెట్టుకొని త్వరలోనే కూకట్‌పల్లి, మూసాపేట డిప్యూటీ కమిషనర్లు గంగాధర్, వంశీకృష్ణ, జెడ్సీ అపూర్వ్ చౌహాన్‌తో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సమావేశం కానున్నట్లు సమాచారం.



స్వీట్‌వన్ షాపును ప్రారంభిస్తున్న సినీనటి అనన్య, నిర్వాహకులు

స్వీట్‌వన్ షాపు ప్రారంభం

హైదర్‌నగర్, మార్చి27 (ఆంధ్రజ్యోతి): నిజాంపేట రోడ్ హైటెన్షన్ లైన్‌లో గురువారం ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, సినీనటి అనన్య స్వీట్‌వన్ షాపును ప్రారంభించారు. అనంతరం నటి అనన్య మాట్లాడుతూ, నగరంలో కార్పొరేట్ స్వీట్ షాపులు ఉన్నప్పటికీ ఈ స్వీట్‌వన్ షాప్‌లో స్వచ్ఛత, నాణ్యత ప్రమాణాలతో కూడిన స్వీట్స్‌ను తక్కువ ధరకు అందించడం ప్రత్యేకత అన్నారు. అనంతరం షాపు మేనేజింగ్ డైరెక్టర్ శంకర్ నారాయణ మాట్లాడుతూ, తనకు క్యాటరింగ్ రంగంలో 30 ఏళ్ల అనుభవం ఉందన్నారు. క్యాటరింగ్‌ను స్థాపించి ఎంతో మందికి పని కల్పిస్తూ ఎన్నో పెళ్లిళ్ళ, శుభకార్యాలకు రుచికరమైన వంటలను అందించి అందరి మన్ననలు పొందానని, అదే స్ఫూర్తితో నగరంలో కార్పొరేట్ స్వీట్ షాపులకు ధీటుగా తన స్వీట్‌వన్ షాప్‌లో తక్కువ ధరకే పేద,మధ్య తరగతి కుటుంబాలకు నాణ్యమైన, స్వచ్ఛమైన, రుచికరమైన స్వీట్స్ అందుబాటులో ఉంచామన్నారు. ఇప్పటి వరకు నగరంలోని వనస్థలిపురం, చింతల్, నిజాంపేటలోని హైదర్‌నగర్‌లో తమ షాపులను ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు, స్థానిక నాయకులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.



ట్రోఫీని అందుకుంటున్న నారాయణమ్మ ఇంజనీరింగ్ కాలేజీ ఖోఖో జట్టు

జేఎన్టీయూ వీసీ ట్రోఫీ ఖోఖో విజేత 'నారాయణమ్మ' జట్టు

● బాలుర విభాగంలో 'జేఎన్‌టీయూ'కు ప్రథమ బహుమతి

హైదరాబాద్ సిటీ, మార్చి27 (ఆంధ్రజ్యోతి): జేఎన్టీయూ ఇండోర్ స్టేడియంలో రెండ్రోజులుగా జరుగుతున్న వైస్‌చాన్సలర్ ట్రోఫీ క్రీడా పోటీలు గురువారం ముగిశాయి. అంతర్ కళాశాలల క్రీడాపోటీల్లో.. బాలికల విభాగంలో నారాయణమ్మ ఇంజనీరింగ్ కాలేజీ ఖో-ఖో జట్టు, బాలుర విభాగంలో జేఎన్‌టీయూ ఖోఖో జట్టు విజేతలుగా నిలిచి ట్రోఫీలను కైవసం చేసుకున్నాయి. కబడ్డీ పోటీలో విద్యాజ్యోతి ఇంజనీరింగ్ కాలేజీ బాలుర జట్టు, బాలికల విభాగంలో ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఏరోనాటికల్ ఇంజనీరింగ్ బాలికల జట్లు ప్రథమ స్థానంలో నిలిచాయి. ఖోఖోలో రన్నరప్‌లుగా సీఎంఆర్ఐటీ బాలుర, సీఎంఆర్ టెక్నికల్ క్యాంపస్ బాలికల జట్లు, కబడ్డీలో ఎంఎల్ఆర్ఐటీ బాలుర, వీజేఐటీ బాలికల జట్లు రన్నరప్‌లుగా నిలిచాయి. విజేతలకు వర్సిటీ ఉన్నతాధికారులు, క్రీడా ప్రముఖులు, కూకట్‌పల్లి జోన్ పోలీసు అధికారుల చేతులమీదుగా బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు, కూకట్‌పల్లి ఏసీపీ శ్రీనివాసరావు, స్పోర్ట్స్ కౌన్సిల్ సెక్రటరీ దిలీప్, ఫిజికల్ డైరెక్టర్ అశోక్, సైబరాబాద్ బిల్డర్స్ అసోసియేషన్ సెక్రటరీ కేపీహెచ్‌బీ ఎస్సై శ్రీలత రెడ్డి పాల్గొన్నారు.


శ్రీకాంత్‌నందకుమార్‌కు పురస్కారం అందజేస్తున్న వెలుదండ నిత్యానందరావు

నాటకం కళ్లతో చేసే యుద్ధం

నిజాంపేట్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : కదిలే ఊహలకు ఆంగికచలనంతో పాటు వాచక సంవాదాత్మకతను జోడిస్తే నాటకమవుతుంది. అలాగే నాటకం కళ్లతో చేసే యుద్ధం లాంటిదని తెలుగు యూనివర్సిటీ ఉపాధ్యక్షులు ఆచార్య వెలుదండ నిత్యానందరావు అన్నారు. గురువారం బాచుపల్లి పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం సమావేశ మందిరంలో ప్రపంచ రంగస్థల దినోత్సవం సందర్భంగా రంగస్థల కళల శాఖ ఏర్పాటు చేసిన జేఎల్ నర్సింహారావు స్మారక రంగస్థల యువ పురస్కార కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రముఖ యువనటుడు, దర్శకుడు శ్రీకాంత్‌నందకుమార్ భలేరావుకు రూ.10 వేల నగదు, ప్రశంసా పత్రాన్ని నిత్యానందరావు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నటుడు నాటకంలోని పాత్రలో జీవిస్తున్నట్లు ప్రేక్షకులకు భ్రమను కలిగించాలని, నటనలో నటుడిగా తాను మరుగున పడిపోయి నటిస్తున్న పాత్రకు గుర్తింపు తెచ్చినవారే గొప్ప నటులన్నారు.


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న రేణుక

మానవ అక్రమ రవాణా నిర్మూలన అందరి బాధ్యత

జీడిమెట్ల, మార్చి 27(ఆంధ్రజ్యోతి): మానవ అక్రమ రవాణా నిర్మూలించడం అందరి బాధ్యత అని కుత్బుల్లాపూర్ ప్రాజెక్టు సీడీపీఓ రేణుక, ప్రజ్వల సీనియర్ ప్రాజెక్టు మేనేజర్ బలరాం కృష్ణ అన్నారు. సూరారంకాలనీలోని లూయిస్ బ్రెయిలీ భవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన రెండు రోజుల శిక్షణా కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. మానవ అక్రమ రవాణా ప్రపంచవ్యాప్తంగా అత్యంత వేగంగా విస్తరిస్తోందని, ఎంతోమంది ఆడవారి జీవితాలను నాశనం చేస్తోందని అన్నారు. సినిమాలు, ప్రేమలు పేరుతో ఎంతోమంది మోసాలకు గురవుతున్నారని వీరికి సరైన అవగాహన కల్పించాల్సిన బాధ్యత అంగన్వాడీ టీచర్లపై ఉందన్నారు. ప్రతి గ్రామంలో సమాజ జాగృతి సంఘాలను ఏర్పాటు చేసి వారి ద్వారా అక్రమ రవాణా సమాచారాన్ని అధికారులకు అందేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణప్రియ, సుజాత, శ్రీదేవి, స్పందన, సురేశ్‌కుమార్, అంబర్‌సింగ్ మిథాలిరాజ్ పాల్గొన్నారు.


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

త్వరితగతిన ధ్రువపత్రాలు అందజేయాలి

నిజాంపేట్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాస్ పథకానికి అవసరమైన ఆదాయ, కుల ధ్రువపత్రాల జారీలో జాప్యం లేకుండా చూడాలని బాచుపల్లి, దుండిగల్ మండలాల తహసీల్దార్లు పూల్‌సింగ్, మతిన్, కుత్బుల్లాపూర్ డిప్యూటీ తహసీల్దార్ మల్లికార్జున్‌రావుకు టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి సూచన మేరకు కాంగ్రెస్ నాయకులు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు అండగా ఉండేందుకు ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన రాజీవ్ వికాస్ పథకం కొరకు అవసరమైన కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు త్వరగా అందజేసేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్‌రెడ్డి, నిజాంపేట అధ్యక్షులు రాజశేఖర్‌రెడ్డి, కొంపల్లి మున్సిపల్ అధ్యక్షులు బైరి ప్రశాంత్‌గౌడ్, భరత్‌గౌడ్, మల్లేష్, సురేష్, పరశురాం ధర్మారెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేత



రాజీవ్ యువ వికాస్ పథకాన్ని బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకే కాకుండా ఈబీసీ కేటగిరి ఉద్యోగులకు కూడా వర్తింపజేయాలని కుత్బుల్లాపూర్ డిప్యూటీ తహసీల్దార్ మల్లికార్జున్‌రావుకు వినతిపత్రం అందజేస్తున్న రాష్ట్ర ఎన్ఎస్‌యూఐ నాయకులు సాయికుమార్ పంతుల

- దుండిగల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి)

మర్యాద పూర్వక కలయిక



హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను గురువారం జాగృతి స్వచ్ఛంద సంస్థ అధ్యక్షురాలు శివపార్వతి మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కుత్బుల్లాపూర్ ప్రాంతంలో జరుగుతున్న ప్రభుత్వ స్థలాల కబ్జాలు, చెరువుల ఆక్రమణలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. కమిషనర్‌ను కలసిన వారిలో లలిత, మహేశ్వరి ఉన్నారు.

- షాపూర్‌నగర్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి)

స్వీపర్‌ను పరామర్శించిన బీజేపీ నాయకులు

పేట్‌బషీరాబాద్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): కొంపల్లి పురపాలకసంఘంలో పనిచేస్తున్న స్వీపర్ బాలమణి 12వార్డులో గత నెలలో పనిచేస్తుండగా వెనుకనుంచి కారు వచ్చి వేగంగా ఢీకొట్టింది. దీంతో తీవ్రగాయాలైన ఆమెను ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. నడుము కింది భాగంలో ఎముక విరగడంతో ఆపరేషన్ చేసి డిశ్చార్జి చేశారు. విషయం తెలుసుకొన్న బీజేపీ నాయకులు గురువారం యాదిరెడ్డిబండలోని వినాయకనగర్‌లోని ఇంటికి వెళ్లి బాలమణిని పరామర్శించి రూ.10వేల నగదును బీజేపీ కొంపల్లి పట్టణ అధ్యక్షుడు సతీష్‌సాగర్, జిల్లా ఉపాధ్యక్షుడు రాజిరెడ్డి, అసెంబ్లీ కోకన్వీనర్ శివాజీరాజు, జిల్లా కౌన్సిల్ జనార్ధన్‌రెడ్డిలు అందించారు.

వరుస చోరీలతో బెంబేలు

● చోద్యం చూస్తున్న పోలీసులు

దుండిగల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : వరుస చోరీలతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ఇంటికి తాళం వేసి వేరే ఊరికి వెళ్లొచ్చే సరికి కుటుంబ యజమానులకు దొంగలు ఇంటి తాళాలు పగులగొట్టి ఇంట్లో ఉన్న వస్తువులను దోచుకెళ్తున్నారు. లక్షల రూపాయలను దోచుకెళ్లడమే కాకుండా బంగారం, వెండి ఆభరణాలను వదలడంలేదు. ఈ నెలలోనే వరుస దొంగతనాలు.. ఒక ద్విచక్ర వాహనదారుడిని గుర్తుతెలియని దుండగులు ఆపి చితకబాది అతని నుంచి నగదు, వస్తువులను దోచుకెళ్లారు. సూరారం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ సంఘటన చోటుచేసుకుంది. నిరంతరం గస్తీలు పెడుతున్నామంటున్న పోలీసులకు దొంగలు సవాలు విసురుతూ దొంగతనాలకు పాల్పడుతున్నారు.

ఈ మధ్యకాలంలో గాజులరామారంకు చెందిన సిద్దప్ప అనే ఓ వ్యక్తి కుటుంబ సభ్యులతో కలిసి బీదర్‌లోని బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి వచ్చే సరికి ప్రధాన ద్వారం ధ్వంసం చేసి ఉండడంతో లోపలికి వెళ్లి చూడగా బీరువా పగులగొట్టి అందులో ఉన్న 2 తులాల బంగారు, 30 తులాల వెండి, నగదును దోచుకెళ్లారు. అలాగే గాజులరామారం వీనస్ ఎన్‌క్లేవ్‌కు చెందిన షరీఫ్ కర్నూలులో తన కుమారుడి ఇంటికి కుటుంబ సభ్యులతో వెళ్లారు. రెండు రోజుల తర్వాత తిరిగి వచ్చేసరికి తలుపులు తొలగించి ఉన్నాయి. ఇంట్లో ఉన్న 20 తులాల బంగారం, నగదును దొంగలు దోచుకువెళ్లారు. విశ్వకర్మకాలనీకి చెందిన సాయికృష్ణ కుటుంబం బయటకు వెళ్లివచ్చే సరికి 3 గ్రాముల బంగారం, ట్యాబ్, వాచ్, కొంత నగదు, బంగారాన్ని దొంగ దోచుకెళ్లడంతో సూరారం పోలీసులను ఆశ్రయించాడు.

బస్తీలు/కాలనీల్లో సూరారం పోలీసులు ఆటోల్లో తిరుగుతూ మైకుల ద్వారా అనుమానాస్పద వ్యక్తులు సంచరించినా, ఊరు వెళ్లేప్పుడు ఇంటిలో విలువైన వస్తువులు ఉంటే సంప్రదించాలని ప్రచారం చేస్తున్నారు. ప్రతి ఒక్కరు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నా కాలనీ/బస్తీ వాసులు పట్టించుకోవడంలేదు. దీంతో పోలీసులకే సవాలు విసురుతూ దొంగలు తమ చేతి వాటాన్ని ప్రదర్శిస్తూ అందిన కాడికి దోచుకెళుతున్నారు.


మంచంపై వస్తువులను చిందర వందరగా పడేసిన దొంగలు


దొంగలు పగులగొట్టిన తాళం


దొంగలు పగులగొట్టిన బీరువా

అవగాహన కల్పిస్తున్నాం...



వరుస దొంగతనాలపై త్వరలోనే చర్యలు తీసుకుంటాం. విలువైన వస్తువులు ఇంటిలో ఉన్నప్పుడు పోలీసులకు సమాచారం అందిస్తే నిఘా పెడతాం. కాలనీలు, బస్తీలు, అపార్టుమెంట్‌లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. సూరారం పీఎస్ పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నాం. ఇందుకు ప్రజలు సైతం సహకరించాలి.

- భరత్‌కుమార్, సీఐ, సూరారం


మందులను పంపిణీ చేస్తున్న విజయరాంరెడ్డి

ఉచిత వైద్య శిబిరం

గాజులరామారం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : గాజులరామారం డివిజన్ బతుకమ్మబండలో మల్లారెడ్డి ఆస్పత్రి ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. సుమారు 200 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు చేసి మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు విజయరాంరెడ్డి, నాయకులు కస్తూరి బాలరాజు, కమలాకర్, చిట్ల వెంకటేష్, తెలంగాణ సాయి పాల్గొన్నారు.

డంపింగ్ యార్డుగా వాటర్‌ట్యాంక్ ప్రాంతం

● కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి

జీడిమెట్ల, మార్చి 27(ఆంధ్రజ్యోతి): జీడిమెట్ల పారిశ్రామికవాడలోని వివిధ ఫేజ్‌ల నుంచి సేకరించిన చెత్తను జవహర్‌నగర్ డంపింగ్ యార్డుకు తరలించాలనే నిబంధనలు ఉన్నాయి. కానీ కాంట్రాక్టర్ మాత్రం రామిరెడ్డినగర్‌ను ఆనుకుని ఉన్న వాటర్‌ట్యాంక్ ఆవరణలో చెత్తను డంప్ చేస్తూ, ఈ ప్రదేశాన్ని డంపింగ్ యార్డుగా మార్చేశాడు. గతంలో కూడా ఇలాగే వ్యవహరించడంతో అప్పటి అధికారులు కాంట్రాక్టర్‌కు జరిమానా విధించి, చెత్తను అక్కడి నుంచి తక్షణమే తొలగించాలని ఆదేశాలు జారీ చేయగా, అతడు చెత్తను తొలగించాడు. ప్రస్తుతమున్న అధికారులకు ఈ ప్రాంతంపై పట్టులేకపోవడంతో తిరిగి ఈ ప్రాంతాన్ని చెత్త డంపింగ్ యార్డుగా మార్చి తనకు ఏమి తెలియనట్టు కాంట్రాక్టర్ వ్యవహరిస్తున్నాడు. రోడ్లు ఊడ్చే యంత్రాన్ని వినియోగించకుండానే ప్రతి నెలా డబ్బులు డ్రా చేసుకుంటున్నట్టు తెలుస్తుంది. టీజీఐఐసీ కార్యాలయంలోని కొందరు సిబ్బంది అండతోనే కాంట్రాక్టర్ ఇష్టాను సారంగా వ్యవహరిస్తున్నాడని పారిశ్రామికవేత్తలు పేర్కొంటున్నారు. తనకున్న పలుకుబడితో అతడు జీడిమెట్ల ఐలాలో ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాడు. అలాగే రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాల పనులు కూడా చేపడుతూ నాణ్యత పాటించడంలేదని తెలుస్తోంది. తక్షణమే చర్యలు తీసుకుని ఇలాంటి వారిని బ్లాక్‌లిస్టులో పెట్టాలని కొందరు పారిశ్రామికవేత్తలు టీజీఐఐసీ అధికారులను కోరుతున్నారు.


డంపింగ్ యార్డుగా మారిన వాటర్ ట్యాంక్ ప్రాంతం

చర్యలు తీసుకుంటాం

జవహర్‌నగర్‌కు తరలించాల్సిన చెత్తను వాటర్‌ట్యాంక్ సమీపంలో డంప్ చేసిన కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకుంటాం. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి అతడి పనితీరుపై పరిశీలిస్తాం. శానిటేషన్ సక్రమంగా నిర్వహించకపోతే బిల్లులు నిలిపివేస్తాం. స్వీపింగ్ యంత్రాన్ని వినియోగించేలా చూస్తాం.

- సుధాకర్‌రెడ్డి, ఐలా మేనేజర్

జోరుగా అక్రమ నీటి వ్యాపారాలు

● అడుగంటుతున్న నీటి నిల్వలు ● పట్టించుకోని అధికారులు


బోరు నీటిని వాటర్‌ట్యాంక్‌లో నింపుతున్న ట్రాక్టర్

పేట్‌బషీరాబాద్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): నగర శివారులో ప్రైవేట్ నీటి ట్యాంకర్లకు అడ్డూ అదుపులేకుండా పోతుంది. కుత్బుల్లాపూర్‌లో బోర్లలో నీరు అడుగంటడంతో ట్యాంకర్లను ఆశ్రయిస్తున్న ప్రజలకు ఆ నీరు ఎక్కడి నుంచి తెస్తున్నారో తెలియని పరిస్థితి దాపురించింది. ఫాక్స్‌సాగర్ పరిసర ప్రాంతాల్లో ఇబ్బడి ముబ్బడిగా బోర్లను వేసి ఆ నీటిని ప్లాస్టిక్ కవర్‌ను తొడిగిన గుంతల్లో నిల్వచేసి ద్వారా ప్రజలకు సరఫరా చేస్తున్నారు. ఎండలు మండుతుండడం, నీటి వినియోగం పెరుగుతుండడంతో నీరు లేక అల్లాడుతుండటంతో నివాస సముదాయాల డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని ట్యాంకర్లను ధరను పెంచేస్తుంది. ప్రైవేట్ ట్యాంకర్‌లపై అధికారుల నియంత్రణ లేకపోవడంతో వారు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఐదువేల లీటర్ల నీటి ట్యాంకర్‌ను అవసరాన్నిబట్టి రూ. రూ.12వందల నుంచి రూ.18వందల వరకు వసూలు చేస్తూ జేబులు నింపుకొంటున్నారు. ఫాక్స్‌సాగర్ చెరువు పరిసర ప్రాంతాల్లో నివాసం ఉంటున్న ఇళ్లల్లో ప్రైవేట్ వ్యక్తులు చేసే వ్యాపారాలతో బోర్లు ఎండిపోతున్నాయని పలువురు వాపోతున్నారు. నిత్యం రోజుకు ప్రైవేట్ ట్యాంకర్లు రాత్రింబవళ్ళు నీటిని విక్రయించడంతో చెరువులో నీరు అడుగంటుతుంది. వాల్టచట్టం ప్రకారం చెరువుల పరిరక్షణ, నీటిదుర్వినియోగాన్ని అరికట్టేందుకు చట్టం ప్రకారం నీటి అక్రమ అమ్మకాలు చేయకూడదు. కానీ దీనికి విరుద్ధంగా నీటి అమ్మకాలే వ్యాపారంగా అక్రమనీటి వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. వాల్టచట్టం నిబంధనలకు విరుద్ధంగా నీటి అమ్మకాలు జరిపేవారిపై చట్టం ప్రకారం శిక్షార్హులుగా భావించాలి. మరి సంబంధిత అధికారులు మొద్దునిద్ర వీడడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. వీరి అండదండలతోనే జోరుగా నీటివ్యాపారాలు సాగుతున్నాయని ప్రజలు మండిపడుతున్నారు. ఇప్పటికైనా రెవెన్యూ, మున్సిపల్ అధికారులు స్పందించి అక్రమ నీటివ్యాపారానికి అడ్డుకట్ట వేయాలని పలువురు కోరుతున్నారు.


డీటీకి వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

క్వారీలను పూడుస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి

గాజులరామారం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : క్వారీల్లో టిప్పర్లతో బండరాళ్లను డంప్ చేస్తున్న నిందితులపై చర్యలు తీసుకోవాలని కుత్బుల్లాపూర్ డిప్యూటీ తహసీల్దార్ మల్లికార్జున్‌రావుకు సీపీఐ కార్యదర్శి ఉమామహేశ్ గురువారం వినతిపత్రం అందజేశారు. గాజులరామారం సర్వే నంబర్ 307, 305లో కబ్జాదారులు టిప్పర్లలో బండరాళ్లను వేసుకుని డంపింగ్ చేస్తున్నారు, నెల రోజుల క్రితం హైడ్రా అధికారులు పట్టుకుని జగద్గిరిగుట్ట పోలీసులకు అప్పగించారు. సీజ్ చేసినా కబ్జాదారులు ఎటువంటి భయం లేకుండా మట్టితో క్వారీలను నింపుతూ అమ్ముకుంటున్నారని డీటీకి తెలిపారు. అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సదానంద్, రవి, సామేల్, ప్రభాకర్, జంబు, కార్తీక్ పాల్గొన్నారు.


ఆర్టీసీ బస్సులో ప్రమాదకరంగా ఫుట్‌బోర్డు ప్రయాణం

ఫుట్‌బోర్డు ప్రయాణం.. కాలు జారితే కష్టమే

షాపూర్‌నగర్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): నగర జీవి అనుదినం బిజీ జీవనం సాగిస్తున్నారు. అనుక్షణం ఉరుకులు, పరుగులతో విధులు, విద్యార్థులు కాలేజీలు, స్కూళ్ళకు వెళ్లేందుకు బస్సులు, ద్విచక్ర వాహనాలు, ఆటోలను ఆశ్రయిస్తున్నారు. అలాగే ఏదో ఒకచోట రోడ్డు ప్రమాదాలు జరిగి ప్రజలు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇంత జరుగుతున్నా ఎవరూ తమ పనులను మానుకోరనేది నిజం. అయితే త్వరగా వెళ్లాలనే ఆత్రుతతో ప్రమాదం అని తెలిసినా బస్సు ఫుట్‌బోర్డుపై వేలాడుతూ వెళ్తుండడం మనం చూస్తుంటాం. జీడిమెట్ల బస్సు డిపో వద్ద యువకులు ఫుట్‌బోర్డు ప్రయాణం ప్రమాదకరం అని తెలిసినా వెళ్తున్నారు. ఒక్కరికి కాలు, చేయి పట్టుతప్పినా ప్రమాదం పొంచి ఉందని గమనించకపోవడం గమనార్హం.

ఆపదలో ఆదుకున్న పోలీసులు



అల్వాల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పాత దివాన్‌దాబా నుంచి అల్వాల్‌కి వెళ్ళే మంగాపూర్ గేట్ రోడ్డులో ఓ ద్విచక్ర వాహనం అదుపుతప్పి యువకుడు కిందిపడిపోయాడు. అక్కడే విధులు నిర్వహిస్తున్న అల్వాల్ ట్రాఫిక్ సీఐ నాగరాజు, సిబ్బంది గమనించి యువకుడికి ప్రథమ చికిత్స చేయించి, ఆసుపత్రిలో చేర్పించారు.

- పేట్‌బషీరాబాద్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి)



దోమల నివారణకు ఫాగింగ్

గాజులరామారం డివిజన్ హెచ్ఏఎల్‌కాలనీ వాసులు దోమల నివారణకు పలుమార్లు సంబంధిత అధికారులను కోరారు. దీంతో స్పందించిన అధికారులు బుధవారం రాత్రి దోమల నివారణకు సిబ్బంది సహాయంతో కాలనీలో ఫాగింగ్ చేశారు.

- షాపూర్‌నగర్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి)

చోరీలకు పాల్పడుతున్న దొంగ అరెస్ట్

● రూ.20లక్షల విలువ చేసే 25 తులాల బంగారు నగలు, 15 తులాల వెండి స్వాధీనం

జీడిమెట్ల, మార్చి 27(ఆంధ్రజ్యోతి): ఇంటి తాళాలు పగలగొట్టి చోరీలకు పాల్పడుతున్న కరుడుగట్టిన ఓ నేరస్తుడిని బాచుపల్లి పోలీసులు అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించారు. అతడి నుంచి రూ.20 లక్షల విలువచేసే 25తులాల బంగారు నగలు, 15తులాల వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. గురువారం బాలానగర్ డీసీపీ కార్యాలయంలో డీసీపీ కె.సురేష్‌కుమార్ విలేకర్ల సమావేశంలో వివరాలను వెల్లడించారు. కూకట్‌పల్లి తులసీనగర్ ప్రాంతంలోని హెచ్ఎంటీ హిల్స్‌లో నివాసముంటున్న నజరుద్దీన్ కుమారుడు మహ్మద్ నసర్ అలియాస్ నసరుద్దీన్(34) వృత్తి రీత్యా సోఫా రిపేర్ వర్కర్. ఇతడికి నగ్మా, శోభారాణి అనే ఇద్దరు భార్యలు, ఒక పాప ఉంది. కేపీహెచ్‌బీ రమ్యా గ్రౌండ్స్ వద్ద నౌసిన్ సోఫాబెడ్ వర్క్‌షాప్ నిర్వహిస్తున్నాడు. 2013లో సరూర్‌నగర్ ప్రాంతంలో ఓ మహిళా హత్యకేసులో నిందితుడు. 2020లో కేపీహెచ్‌బీ, బాచుపల్లి పోలీస్‌స్టేషన్ల పరిధిలో దొంగతనాలకు పాల్పడిన కేసులో పీడీ యాక్టు కింది జైలు జీవితం గడిపాడు. తన సోఫా తయారీ షాపులో నష్టం రావడంతో తిరిగి దొంగతనాలు చేయాలని నిర్ణయించుకున్నాడు. ప్రగతినగర్, సరోవర్ బిల్డింగ్, రాజీవ్ గృహకల్ప రోడ్డులో ఉంటున్న తన రెండో భార్య శోభారాణి స్నేహితురాలు నిరోషా ఇంటి తాళాలు పగలగొట్టి బీరువాలోని 25తులాల బంగారు నగలు, 15తులాల వెండి వస్తువులు దొంగిలించాడు. బాధితులు బాచుపల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదుచేసి పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఈ నెల 26న దొంగిలించిన సొత్తును బౌరంపేట్ ప్రాంతంలోని ఎన్‌పీ రాయల్ ఫర్నిచర్ షాపులో విక్రయించడానికి యత్నించగా స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అతడిని పట్టుకుని విచారంగా దొంగతనానికి పాల్పడినట్టు అంగీకరించాడు. సొత్తును రికవరీ చేసి నిందితుడ్ని రిమాండ్‌కు తరలించారు.


స్వాధీనం చేసుకున్న బంగారు, వెండి నగలు చూపిస్తున్న డీసీపీ


కుత్బుల్లాపూర్ సర్కిల్ కార్యాలయంలో ఆహ్లాదం పంచుతున్న చెట్లు

కుత్బుల్లాపూర్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : కుత్బుల్లాపూర్ సర్కిల్ కార్యాలయం పరిసరాలు పచ్చని చెట్లతో ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. ఏపుగా పెరిగిన మొక్కలు కార్యాలయానికి వచ్చే వారికి నీడనిస్తున్నాయి. వేసవి నేపథ్యంలో దూర ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలు ఆ చెట్ల కింద బల్లలపై కూర్చుని సేద తీరుతున్నారు. నీడనిచ్చే చెట్లతో పాటు పనస, జామ, మామిడి ఇతర రకాల పండ్ల మొక్కలను నాటించడం విశేషం.


చెట్ల కింద బల్లలపై కూర్చున్న ప్రజలు


ఏపుగా పెరిగిన పనస చెట్టు, ఇతర మొక్కలు




సర్కిల్ పరిసరాలంతా పచ్చని చెట్లతో దర్శనమిస్తున్న దృశ్యం

గుర్తు తెలియని వ్యక్తి మృతి


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

దుండిగల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గండిమైసమ్మ చౌరస్తాలోని ముత్తూట్ ఫైనాన్స్ బిల్డింగ్ వద్ద ఈ నెల 23న గుర్తుతెలియని వ్యక్తి(45) అనుకోనివిధంగా కింద కూర్చుండిపోయాడు. చుట్టుపక్కల వారు ఏమైందని అడిగే లోపే స్పృహతప్పి పడిపోయాడు. స్థానికుల సమాచారంతో పోలీసులు ఘటన స్థలానికి 108 సిబ్బందితో చేరుకుని పరిశీలించగా మృతి చెందినట్లు గుర్తించారు. మృతుడు ధరించిన షర్ట్‌పై నిప్పన్ సర్వీసెస్ అని ఉందని, గ్రీన్ కలర్ లుంగీ ఉంది. మృతుడికి సంబంధించిన వారెవరైనా ఉంటే దుండిగల్ పోలీసులను సంప్రదించవచ్చు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీకి తరలించి దర్యాప్తు చేస్తున్నారు.


స్వీట్‌వన్ షాపును ప్రారంభిస్తున్న సినీనటి అనన్య, నిర్వాహకులు

స్వీట్‌వన్ షాపు ప్రారంభం

హైదర్‌నగర్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): నిజాంపేట రోడ్డు హైటెన్షన్ లైన్‌లో గురువారం ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, సినీనటి అనన్య స్వీట్‌వన్ షాపును ప్రారంభిచారు. అనంతరం నటి అనన్య మాట్లాడుతూ నగరంలో కార్పొరేట్ స్వీట్ షాపులు ఉన్నప్పటికి ఈ స్వీట్ వన్‌షాప్‌కు స్వచ్ఛత, నాణ్యత ప్రమాణాలతో కూడిన స్వీట్‌ను అతి తక్కువ ధరలో అందించడమే యాజమాన్యం ప్రత్యేకత న్నారు. అనంతరం షాపు మేనేజింగ్ డైరెక్టర్ శంకర్ నారాయణ మాట్లాడుతూ తాను 30 సంవత్సరాలుగా క్యాటరింగ్ రంగంలో అపారమైన అనుభవాన్ని ఘటించానని అన్నారు. క్యాటరింగ్ స్థాపించి ఎంతోమందికి పని కల్పిస్తు ఎన్నో పెళ్లిళ్ల శుభకార్యాలకు తన క్యాటరింగ్ ద్వారా రుచికరమైన వంటలను అందించి మన లను పొందానని అదే స్ఫూర్తితో నగరంలో కార్పొరేట్ స్వీట్ షాపులకు దీటుగా తన స్వీట్‌వన్ షాప్ తక్కువ ధరకే పేద, మధ్యతరగతి కుటుంబాలకు నాణ్యమైన, స్వచ్ఛమైన, రుచికరమైన స్వీట్లు అందుబాటులో ఉంచామన్నారు. ఇప్పటి వరకు నగరంలో వనస్థలిపురం, చింతల్, నిజాంపేటలోని హైదర్‌నగర్‌లో ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు, నాయకులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

అరుణోదయ కాలనీ అధ్యక్షుడిగా కోటేశ్వర రావు

గచ్చిబౌలి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మాదాపూర్ అరుణోదయ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా కోటేశ్వర రావు రెండోసారి ఎన్నికయ్యారు. గురువారం జరిగిన ఎన్నికల్లో కోటేశ్వరరావు విజయం సాధించినట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు. ప్రధాన కార్యదర్శిగా ఎం.శ్రీహరి, ఉపధ్యక్షుడిగా వసంతకుమార్, జాయింట్ సెక్రెటరీగా నందు, కోశాధికారిగా సుబుద్ధి ఎన్నిరయ్యారని రిటర్నింగ్ అధికారిగా వ్యవహరించిన ఎన్‌ఆర్ ప్రసాద్ తెలిపారు. అధ్యక్షుడిగా ఎన్నిఅయిన కోటేశ్వరరావు మాట్లాడుతూ కాలనీ అభివృద్ధి కోసం నిరంతరం పాటుపడతామని, అందరిని కలుపుకొని అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. కాలనీ సమస్యలను ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, కార్పొరేటర్ జగదీశ్వర్ గౌడ్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కాలనీవాసులు సంక్షేమ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా యోగేశ్వర స్వామి కల్యాణం


యోగేశ్వరస్వామికి జరుగుతున్న అభిషేకం

భెల్‌కాలనీ, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మాసశివరాత్రి పర్వదినం సందర్భంగా బీహెచ్‌ఈఎల్ టౌన్‌షిప్‌లోని శ్రీ యోగేశ్వరస్వామి ఆలయంలో గురువారం నిత్యపూజలతో పాటు విశేష అభిషేకాలు జరిగాయి. శివాలయంలో ఉదయం స్వామి వారికి ఫలపంచామృతాభిషేకం, ప్రత్యేక అర్చనలు, యాగశాలలో మహామృత్యుంజయ హోమం నిర్వహించారు. సాయంత్రం నిత్యపూజలతో పాటు సుగంధ పుష్పాలతోసుందరంగా అలంకరించిన మండపంలో స్వామివారి ఉత్సవ మూర్తులను అలంకరించి యోగేశ్వర స్వామివారి కల్యాణం కనులపండువగా నిర్వహించారు. దేవాలయ ప్రధాన అర్చకుడు దత్తుశర్మ, సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో కార్మికులు, కాలనీవాసులు పాల్గొన్నారు.


ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, సీనియర్ నాయకుడు చాంద్‌పాషా, తదితరులు

ఏ-బ్లాక్ కాలనీలో ఇఫ్తార్ విందు

మియాపూర్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): కొండాపూర్ డివిజన్ ఏ-బ్లాక్ కాలనీలో సీనియర్ నాయకుడు చాంద్‌పాషా ఆధ్వర్యంలో నిర్వహించిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ రంజాన్ మాసం చాలా పవిత్రమైనదని, ఈ సందర్భంగా పాటించే ఉపవాస దీక్షలు నిష్టతో దైవ ప్రార్థనలతో శాంతి, సౌభ్రాతృత్వాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఇవ్వడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

పన్నులు చెల్లించి అభివృద్ధికి సహకరించండి

- ఉప కమిషనర్ ముఖుంద్ రెడ్డి

గచ్చిబౌలి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలోని ఆస్తి పన్ను చెల్లింపుదారులు తమ పన్నులు సకాలంలో చెల్లించి జీహెచ్ఎంసీ అభివృద్ధికి సహకరించాలని సర్కిల్ ఉప కమిషర్ ముఖుంద్‌రెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. 2024-2025 ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో పన్ను చెల్లింపుదారులు పాత బకాయిలను ఈ నెల 31లోపు చెల్లిస్తే 90 శాతం వడ్డీ మాఫీ చేయడం జరుగుతుందని, ఈ అవకాశం ప్రభుత్వం కల్పించదని అన్నారు. గడువులోగా చెల్లించిన వారికే ఈ పథకం వర్తిస్తుందన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఆస్తి పన్నులు రూ.256.55 కోట్లు వసూలు చేయడం జరిగిందని అన్నారు. అధికారులు తమకు రూ.276 కోట్లు వసూళ్ల చేయాలని టార్గెట్ ఇచ్చారని. మార్చి 31వ తేదీ వరకు టార్గెట్‌ను పూర్తిచేస్తామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఆస్తులు డివిజన్ పరిధిలో చాలా ఉన్నాయని, ఆ సంస్థలు పన్నులు చెల్లిస్తే టార్గెట్‌ను అధిగమిస్తామని ఆయన అన్నారు. ఆ సంస్థలకు నోటీసులు ఇవ్వడం జరిగిందని గడువులోగా చెల్లించవచ్చని అభిప్రాయపడ్డారు. ఏది ఏమైనా మార్చి 31 లోగా అధికారులు ఇచ్చిన పన్నుల వసూళ్లలో టార్గెట్‌ను అధికమిస్తామని అన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

మియాపూర్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందిన సంఘటన మియాపూర్ బొల్లారం రోడ్డులో గురువారం రాత్రి జరిగింది. మియాపూర్ ఆదిత్యనగర్‌కు చెందిన అరుణ్ రషీద్(40) పని నిమిత్తం బైక్ మీద బాచుపల్లి వెళ్లి తిరిగి వస్తుండగా మియాపూర్ బొల్లారం రోడ్డులో కోకాకోలా సమీపంలో బైక్ డివైడర్‌కు ఢీ కొని కిందపడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. ప్రమాదం ఎలా జరిగిందనే అంశంపై స్పష్టత లేదని, ఈ ప్రాంతంలో ఉన్న సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నామని, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

చైన్ స్నాచింగ్‌కు పాల్పడిన ముగ్గురి మైనర్లు అరెస్టు

మియాపూర్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): రోడ్డుపై వాకింగ్ చేస్తున్న వ్యక్తి మెడలో నుంచి గొలుసు లాక్కెళ్లిన ముగ్గురు నిందితులను మియాపూర్ పోలీసులు అరెస్టు చేసి జువెనైల్ హోమ్‌కు తరలించారు. ఈ నెల 23న రాత్రి 7.45 గంటలకు ముగ్గురు మైనర్లు ద్విచక్ర వాహనంపై చంద్రబాబునాయుడు గెస్ట్‌హౌస్ సమీపంలోని రోడ్‌లో వెళ్తున్నారు. ఇదే రోడ్డులో నార్నె ఎస్టేట్ లెగ్జీరియో రెసిడెన్సిలో నివాసం ఉంటున్న చొప్పారపురాజా పూర్ణచంద్రరావు వాకింగ్ చేసి వెళ్తుండగా వెనుక నుంచి ముగ్గురు మైనర్లు ద్విచక్రవాహనంపై వచ్చి అతని మెడలోని గొలుసును తెంచుకునివెళ్లారు. దీంతో పూర్ణచంద్రరావు మియాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ముమ్మరం చేశారు. సీసీఎస్, మియాపూర్ పోలీసులు సంయుక్త ఆధ్వర్యంలో ముగ్గురు మైనర్లను అదుపులోకి తీసుకుని విచారించగా చైన్‌స్నాచింగ్ పాల్పడింది తామేనని అంగీకరించారు. వారి వద్ద నుంచి మూడు తులాల బంగారు గొలుసును స్వాధీనం చేసుకొని వారిని జువెనైల్ హోమ్‌కు తరలించిట్లు తెలిపారు.

శేరిలింగంపల్లిలో మరో ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్


ఓల్డ్ హఫీజ్‌పేట్‌లో ఏర్పాటు కానున్న కొండాపూర్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్


శేరిలింగంపల్లి ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్

- ఏప్రిల్ 1 కొండాపూర్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ ప్రారంభం
- ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్‌గా లక్ష్మణ్‌గౌడ్

చందానగర్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నూతన ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ల సంఖ్యను పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసిన విషయం విదితమే. అందులో భాగంగా శేరిలింగంపల్లి నియోజకవర్గంలో నూతన ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని ఉన్నతాధికారులకు నివేదించారు. కొండాపూర్ డివిజన్‌లో ఏర్పాటు చేయాలని అధికారులు ఉత్తర్వులు జారీచేశారు. శేరిలింగంపల్లిలోని ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ రెండుగా విడిపోనుంది. శేరిలింగంపల్లి అభివృద్ధి చెందుతున్న క్రమంలో భారీగా కార్యాలయాలు, ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నాయి. మండలం రోజురోజుకు విస్తరించి జనాభా కూడా పెరుగుతుంది. ప్రస్తుతం 15 లక్షలకు పైగా ప్రజలు నివాసం ఉంటున్నారు. ఈ క్రమంలో ప్రజల రక్షణ, భద్రత కోసం చందానగర్, మియాపూర్ మాదాపూర్, గచ్చిబౌలి, రాయదుర్గం ప్రాంతాల్లో లా అండ్ ఆర్డర్ పోలీస్‌స్టేషన్లు ఉన్నాయి. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ ఒక్కటే ఉంది. క్రైం కేసులు పెరుగుతున్న నేపథ్యంలో అరకొర సిబ్బంది ఉండడంతో ఇబ్బందులు ఎదురౌతున్నాయి. హఫీజ్‌పేట్‌లోని ప్రభుత్వ పాఠశాల ప్రక్కన్న ఉన్న నైట్ షల్టర్ భవనంలో కొండాపూర్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేయనున్నారు. ఏప్రిల్ 1 నుంచి ఈ స్టేషన్ అందుబాటులోకి రానుంది. ప్రస్తుతానికి శేరిలింగంపల్లి ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్‌గౌడ్ ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తారు.

పరిధిలోకి వచ్చే ప్రాంతాలలు...

కొండాపూర్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోకి మాదాపూర్, కొండాపూర్ డివిజన్లకు సంబందించిన అన్ని కాలనీలు, బస్తీలు వస్తాయి. చందానగర్, మియాపూర్, గచ్చిబౌలి, రాయదుర్గం డివిజన్లు శేరిలింగంపల్లి ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోకి వస్తాయి.

వైన్ షాపులు, బార్లు...

శేరిలింగంపల్లి ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 39 వైన్ షాపులు, 134 బార్‌లు ఉన్నాయి. విభజనలో భాగంగా కొండాపూర్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోకి 18 వైన్ షాపులు, 71 బార్‌లు వస్తాయి.

క్రైం రేట్ తగ్గించడానికే విభజన



శేరిలింగంపల్లి మండలం చాల పెద్దది, దానికి తోడు జనాభా పెరుగుతుంది. లా అండ్ అర్డర్ పోలీస్‌స్టేషన్లు ఉన్నప్పటికి ఒకే ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ ఉంది. రోజురోజుకు క్రైం రేట్ పెరుగుతుంది. దీనిని తగ్గించేందుకే శేరిలింగంపల్లి మండలంలో రెండు ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ల అవశ్యకత ఎంతైన ఉంది. ఏప్రిల్ 1 నుంచి కొండాపూర్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ అధికారికంగా చేలామని అవుతుంది.

- లక్ష్మణ్‌గౌడ్,
శేరిలింగంపల్లి ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్

పారిశుధ్య నిర్వహణపై చర్యలు తీసుకోవాలి

- శేరిలింగంపల్లి జడ్సీ ఉపేందర్‌రెడ్డి


భారతీనగర్ డివిజన్‌లో పర్యటిస్తున్న జడ్సీ ఉపేందర్‌రెడ్డి

భెల్‌కాలనీ, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): బీహెచ్‌ఈఎల్ మాక్ సొసైటీ కాలనీ ప్రధాన రహదారికి ఇరువైపులా పేరుకుపోయిన చెత్తకుప్పలను తొలగించాలని శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. డివిజన్ పరిధిలోని పలు కాలనీలు, సమస్యాత్మక ప్రాంతాల్లో డివిజన్ కార్పొరేటర్ సింధూఆదర్శ్‌రెడ్డి, జీహెచ్ఎంసీ అధికారులు, బీహెచ్‌ఈఎల్ టౌన్‌షిప్ అడ్మినిస్ట్రేషన్ ఎస్టేట్ అధికారులతో కలిసి పర్యటించి పారిశుధ్య నిర్వహణ, చెత్తకుప్పల తొలగింపు గురించి చర్చించారు. చెత్తకుప్పలు పేరకుపోవడంతో ఈ ప్రాంతమంతా దుర్గంధభరితంగా మారి దుర్వాసన వెదజల్లుతోందని, కాలనీవాసుల నుంచి నిత్యం ఫిర్యాదులు వస్తున్నాయని కార్పొరేటర్ సింధూ ఆదర్శ్‌రెడ్డి జడ్సీ దృష్టికి తీసుకువచ్చారు. గతంలో పలుమార్లు పారిశుధ్య పనులు చేపట్టినప్పటికీ ఫలితం లేదని, చైన్‌మెష్‌లు ఏర్పాటుతోనే పరిష్కారం అవుతుందని తెలిపారు. ఈ ప్రాంతం బీహెచ్‌ఈఎల్ పరిధిలో ఉన్నందున అధికారుల సహకారం ఉండడంలేదని తెలిపారు. దీనిపై కమిషనర్ ఉపేందర్‌రెడ్డి స్పందిస్తూ అక్కడే ఉన్న బీహెచ్‌ఈఎల్ ఎస్టేట్ ఏజీఎం సురస్‌ప్రసాద్‌తో మాట్లాడారు. సమస్య పరిష్కారం కోసం సహకారం అందించాలని సూచించారు. రైతుబజార్ వద్ద జరుగుతున్న నిర్మాణ పనులను పరిశీలించి పార్కింగ్ వాల్‌కు గ్రిల్స్ ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు పంపాలని అధికారులకు సూచించారు. డివిజన్‌లో జరుగుతున్న పనులను వేగవంతంగా నిర్ధేశించిన సమయానికి పనులు పూర్తి చేయాలని సూచించారు. కమిషనర్‌తో ఉప కమిషనర్ సురేష్, బీఆర్ఎస్ నాయకుడు ఆదర్శ్‌రెడ్డి, ఇంజనీరింగ్ ఈఈ సురేష్, డీఈ నరేందర్, ఏఈ దివ్య తేజ, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

నూతన వంతెనకు జైపాల్‌రెడ్డి పేరు పెట్టాలి


మంత్రి పొన్నం ప్రభకర్‌కు వినతి పత్రం అందజేస్తున్న కార్తీక్

గచ్చిబౌలి, మార్చి 27(ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి, పటాన్‌చెరు నియోజకవర్గాలను అనుసంధానం చేస్తూ లింగంపల్లి చౌరస్తాలో నిర్మించిన వంతెనకు దివంగత పార్లమెంట్ సభ్యుడు జైపాల్‌రెడ్డి పేరు పెట్టాలని టీపీసీసీ కార్యదర్శి సామ్యూల్ కార్తీక్ డిమాండ్ చేశారు. గురువారం గ్రేటర్ హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఉత్తమ పార్లమెంటేరియన్ కీ.శే. జైపాల్‌రెడ్డి పేరుగానీ, మాజీ ప్రధాని ఇందిరా గాంధీ పేరు పెట్టాలని అన్నారు. పనులు పూర్తి అయి ప్రారంభానికి సిద్ధంగా ఉన్న వంతెనకు ఈ రెండు పేర్లల్లో ఏదైనా పెట్టేలా చూడాలని కార్తీక్ వినతి పత్రంలో పేర్కొన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ ఈ విషయాన్ని సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి ఇద్దరిలో ఒక పేరు పెట్టేలా చర్యలు తీసుకుంటానని సామ్యూల్ కార్తీక్‌కు హామీ ఇచ్చారు.

లింగంపల్లి బస్టాపులో ఆటోల అక్రమ పార్కింగ్

- ఇబ్బందుల్లో ప్రయాణికులు, విద్యార్థులు


చౌరస్తా, బస్‌స్టాపుల్లో అక్రమ పార్క్ చేసిన ఆటోలు

భెల్‌కాలనీ, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): లింగంపల్లి ఆర్టీసీ బస్టాప్‌లు ఆటో వాలాలకు అడ్డాలుగా మారాయి. బస్టాపుల్లో అక్రమంగా పార్కింగ్ చేస్తు ప్రయాణికులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ఆర్టీసీ బస్సులు నిలపాల్సిన చోట నిత్యం ఆటోలు నిలుపుతుండడంతో రహదారి మధ్యలో బస్సులు ఆపాల్సివస్తుంది. దీంతో ప్రయాణికులు బస్సుల కోసం పరిగెత్తి ప్రమాదాల భారిన పడుతున్నారు. ప్రధానంగా పటాన్‌చెరు, సంగారెడ్డి నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులు లింగంపల్లి చౌరస్తాలో ఉన్న హెచ్‌పీ పెట్రోల్ బంకు వద్ద గల బస్టాప్‌లో ఆగుతాయి. బస్సులు ఆపే ప్రాంతంలోనే ఆటోలు నిలుపుతుండడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బస్సులు వచ్చే సమయంలోనే ఆటోలను అడ్డంగా నిలుపుతుండడంతో బస్సులు ఎక్కేందుకు ప్రయాణికులు పరుగులు పెట్టాల్సివస్తోంది. ఆటోలను తొలగించాలని సూచిస్తే ఆటోవాలాలు దురుసుగా సమాధానం ఇస్తు ప్రయాణికులు ఆర్టీసీ డ్రైవర్లపై వాదనకు దిగుతున్నారు.

ఉదయం సమయంలో కాలేజీలకెళ్లే విద్యార్థులు, ఉద్యోగులు లింగంపల్లి బస్టాప్‌కు వచ్చి ఇక్కడి నుండే వెళుతుంటారు. బస్సులు ఆగే ప్రాంతంలో ఆటోలు నిలుపుతుండడంతో ఆర్టీసీ బస్సులు రోడ్డు నడుమే నిలుపుతున్నారు. దీంతో ప్రయాణికులు రహదారుల మధ్యలో బస్సుల కోసం వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది. సంబందిత ట్రాఫిక్, ఆర్టీసీ అధికారులు ఇప్పటికైన స్పందించి ఆటోవాలాల ఆగడాలు అరికట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

సమస్యలపై అసెంబ్లీలో మాట్లాడిన ఎమ్మెల్యే గాంధీ

మియాపూర్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై, పారిశుధ్య కార్మికులు సమస్యలు, వీధి దీపాలు వంటి అంశాలపై ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అసెంబ్లీలో మాట్లాడారు. నియోజకవర్గం దేశంలోనే పెద్ద నియోజకవర్గమని, అత్యధిక ప్రజానీకం నివాసం ఉంటున్న ప్రాంతమని, ముంబాయ్ జతీయ రహదారికి ఇరువైపులా ఉన్న భాగం ఒకవైపు రోడ్లు పూర్తిస్థాయిలో అయ్యాయని, ఈ మధ్యనే సీఎం రేవంత్‌రెడ్డి గచ్చిబౌలిలో రూ.1650 కోట్ల నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. నియోజకవర్గ ప్రజల తరుపున సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా ముంబాయ్ జాతీయ రహదారికి మరోవైపు ఉన్న రోడ్డుకు నిధులు మంజూరు చేసి అభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. ఉషాముళ్లపూడి రోడ్డు విస్తర్ణ, ఫ్లై ఓవర్ నిర్మాణం, నిజాంపేటరోడ్, గంగారం హనుమాన్ దేవాలయం నుంచి అపర్ణ అపార్ట్‌మెంట్ వరకు నిర్మించే లింకు రోడ్డు వంటి రోడ్ల అభివృద్ధి చేయాలని, చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్నాయని సభ దృష్టికి తీసుకువెళ్లారు. అత్యధిక జనాభా ఉండటంతో ట్రాఫిక్ అదేస్థాయిలో ఉంటుందని, సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని నిధులు మంజూరు చేయాలని కోరారు. పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, 30 నుంచి 40 ఏళ్లుగా పారిశుధ్య కార్మికుల సమస్య తీవ్రంగా ఉందని ఓ సర్కిల్‌లో 550 మంది కార్మికులు ఉంటే 200 నుంచి 250 మాత్రమే పనిచేస్తున్నారని వివరించారు. శేరిలింగంపల్లి, చందానగర్, కూకట్‌పల్లి సర్కిల్‌లో ఎక్కడ 50 శాతం మించి పనిచేయడం లేదని, గతంలో రిటైర్డ్‌మెంట్ అయినవారు, చనిపోయిన వారి కుటుంబాలలో జోనల్ స్థాయిలో అపాయింట్‌మెంట్‌లు ఇచ్చేవారని, ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు. ప్రత్యేక చొరవ తీసుకుని ఆ కుటుంబాలకు చెందిన వారిని విధులోకి తీసుకోవాలని కోరారు.

టైటిల్ వివాదంలో ఉన్న..
గుట్టల బేగంపేట్ 78 ఎకరాలపై స్టేటస్ కో

హైదరాబాద్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం గుట్టల బేగంపేట్ గ్రామంలోని సర్వే నంబర్ 63లో ఉన్న దాదాపు 78 ఎకరాల భూమి స్వరూపాన్ని మార్చకుండా యథాతథ స్థితి (స్టేటస్ కో) కొనసాగించాలని హైకోర్టు డివిజన్ బెంచ్ ఆదేశాలు జారీ చేసింది. ఈ భూమి విషయంలో బుక్యార్‌ఖాన్ ఇతర కుటుంబ సభ్యులకు అనుకూలంగా హైకోర్టు సింగిల్ జడ్జి తీర్పు ఇవ్వడాన్ని సవాల్ చేస్తూ ఖాజా కరీముల్లా ఖాన్ తదితరులు హైకోర్టు డివిజన్ బెంచ్‌లో అప్పీళ్ల దాఖలు చేశారు. తప్పుడు పత్రాల ఆధారంగా సింగిల్ జడ్జి ప్రతివాదులకు అనుకూలంగా తీర్పు ఇచ్చారని.. సుదీర్ఘకాలంగా కబ్జాలో ఉన్నంత మాత్రాన భూమి వారిదైపోదని పేర్కొన్నారు. సింగిల్ జడ్జి 1962 నుంచి మాత్రమే చరిత్రను పరిశీలించి తీర్పు ఇచ్చారని.. అంతకుముందున్న చరిత్రను పట్టించుకోలేదని పేర్కొన్నారు. ప్రతివాదులను ప్రభుత్వమే స్వయంగా ఆక్రమణదారులుగా గుర్తించినప్పటికీ సింగిల్ జడ్జి సదరు విషయాన్ని పట్టించుకోలేదని తెలిపారు. ప్రతివాదుల తరపున న్యాయవాదులు వాదిస్తూ.. అప్పీలుదారులు తప్పుడు పత్రాలు సృష్టించి ప్రభుత్వ అధికారుల సహాయంతో భూమిని ఆక్రమించాలని చూస్తున్నారని, ఈ విషయాన్ని సింగిల్ జడ్జి గుర్తించి తమకు అనుకూలంగా తీర్పు ఇచ్చారని పేర్కొన్నారు. అన్ని వర్గాల వాదనలు విన్న తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ రేణుక ధర్మాసనం వివాదం తేలేవరకు వివాదాస్పద భూమి విషయంలో అన్ని పక్షాలు యథాతథ స్థితి కొనసాగించాలని స్పష్టం చేసింది. తదుపరి విచారణ నాలుగు వారాలకు వాయిదా పడింది.

జల్సాల కోసం చోరీల బాట

- యువకుడిని అరెస్టు చేసిన కేపీహెచ్‌బీ పోలీసులు
- 6 ల్యాప్‌టాప్‌లు, 2 సెల్‌ఫోన్లు స్వాధీనం

హైదర్‌నగర్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): విలాసవంతంగా గడిపేందుకు చోరీలు బాటపట్టిన ఓ యువకుడిని కేపీహెచ్‌బీ పోలీసులు అరెస్టు చేశారు. గురువారం కూకట్‌పల్లి ఏసీపీ కె.శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం... తమిళనాడు రాష్ట్రం వెల్లూర్‌కు చెందిన జీవ గణేషన్ అలియాస్ గణేష్(26) సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరులో నివాసముంటూ మేస్త్రీ పని చేసేవాడు. ఈ క్రమంలో గణేష్‌కు కుమార్ అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. మేస్త్రీగా ఎంతకాలం కష్టపడతావు, సులభంగా డబ్బు సంపాదించి విలాసవంతంగా జీవించవచ్చని గణేష్‌తో నమ్మబలికిన కుమార్ అతడిని ముంబైకి తీసుకెళ్లాడు. అక్కడ ల్యాప్‌టాప్‌లు ఎలా దొంగతనం చేయాలో గణేష్‌కు కుమార్ నేర్పించాడు. ఇద్దరూ కలిసి దొంగిలించిన ల్యాప్‌టాప్‌లు రాజేందర్ అనే వ్యక్తికి తక్కువ ధరకు విక్రయించి సొమ్ము చేసుకుని వచ్చిన డబ్బుతో జల్సాలు చేసేవారు. హైదరాబాద్‌లో ఇదే విధంగా చోరీలు చేయాలని నిర్ణయించుకున్న గణేష్ ముంబై నుంచి వెనక్కి వచ్చేశాడు. గతేడాది మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నాలుగు ల్యాప్‌టాప్‌లు, సెల్‌ఫోన్ దొంగిలించాడు. వారం రోజుల క్రితం కేపీహెచ్‌బీ, కూకట్‌పల్లి పోలీసు స్టేషన్ల పరిధిలో రోజుల వ్యవధిలో ఆరు ల్యాప్‌టాప్‌లు చోరీ జరిగినట్లు పోలీసులకు ఫిర్యాదులందాయి. విచారణ చేపట్టిన కేపీహెచ్‌బీ పోలీసులు, సీసీఎస్ పోలీసుల సహకారంతో కేపీహెచ్‌బీ కాలనీలో ఓ ఇంటి వద్ద రెక్కీ నిర్వహిస్తున్న గణేష్‌ను అదుపులోకి తీసుకొని విచారించారు. అతడి వద్ద నుంచి ఆరు ల్యాప్‌టాప్‌లు, రెండు సెల్‌ఫోన్లు రికవరీ చేశారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.


మహిళా కమిటీ సభ్యులతో నియోజకవర్గ ఇన్‌చార్జి చంద్రిక

కాంగ్రెస్ పార్టీ మహిళా డివిజన్ కమిటీలు

హైదర్‌నగర్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ మహిళ అధ్యక్షురాలు సునీతారావు పిలుపు మేరకు రంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు జ్యోతిభీమ్ భరత ఆదేశాల మేరకు నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు చంద్రిక మియాపూర్, వివేకానందనగర్, హైదర్‌నగర్ డివిజన్ కమిటీలను నియమించారు. ఇందులో భాగంగా రాష్ట్ర కాంగ్రెస్ మహిళా సెక్రటరీ రమాదేవి, ఏ-బ్లాక్ అధ్యక్షురాలిగా శ్రీదేవి, ఉపాధ్యక్షురాలిగా శాంతా, జనరల్ సెక్రటరీగా భవాని, కృష్ణకుమారి, సెక్రటరీగా జ్యోతి, మియాపూర్ అధ్యక్షురాలిగా సుప్రజ, వివేకానందనగర్ అధ్యక్షురాలిగా నాగమణి, హైదర్‌నగర్ అధ్యక్షురాలిగా విమలను నియమించి నియామక పత్రాలు అందజేశారు.

రోడ్డుపై బోరు వేయడంతో ఇబ్బందులు

హైదర్‌నగర్, మార్చి 27 (ఆంధ్రజోతి): కూకట్‌పల్లి వెంకటేశ్వరనగర్ బ్లాక్-సిఎస్‌లో బస్తీదవాఖానాకు వెళ్లే దారిలో శేఖర్‌అనే వ్యక్తి రోడ్డుపై ఆరు ఇంచుల బోర్ వేయడంతో దవాఖానాకు వెళ్లే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని కాలనీ అధ్యక్షుడు లక్ష్మణ్ స్థానికులతో కలిసి తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేశాడు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

స్కానర్, ప్రింటర్ పనిచేయక ప్రజల ఇక్కట్లు

చందానగర్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత కాలంలో అన్నీ ఆన్‌లైన్ సేవలతోనే ముడిపడి ఉంది. ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో ఆన్‌లైన్ లేనిదే అడుగు ముందుకు పడదు. ఆన్‌లైన్ వ్యవహరాలు సవ్యంగా సాగలాంటే స్కానర్, ప్రింటర్ చేయాలి. గురువారం చందానగర్ మున్సిపలిటీ సర్కిల్ కార్యాలయ భవనంలోని ప్రభుత్వ మీ-సేవలో ప్రింటర్ పనిచేయకపోవడంతో గంటల తరబడి ప్రజలు వేచిఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికైన అధికారులు స్పందించి సమస్యను పరిష్కారించాలని పలువురు కోరుతునన్నారు.


ట్రోఫీని అందుకుంటున్న నారాయణమ్మ ఇంజనీరింగ్ కాలేజీ ఖోఖో జట్టు

జేఎన్టీయూ వీసీ ట్రోఫీ
ఖోఖో విజేత 'నారాయణమ్మ' జట్టు

- బాలుర విభాగంలో 'జేఎన్‌టీయూ'కు ప్రథమ బహుమతి

హైదరాబాద్ సిటీ, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): జేఎన్టీయూ ఇండోర్ స్టేడియంలో రెండ్రోజులుగా జరుగుతున్న వైస్‌చాన్స్‌లర్ ట్రోఫీ క్రీడా పోటీలు గురువారం ముగిశాయి. అంతర్ కళాశాలల క్రీడాపోటీల్లో.. బాలికల విభాగంలో నారాయణమ్మ ఇంజనీరింగ్ కాలేజీ ఖో-ఖో జట్టు, బాలుర విభాగంలో జేఎన్‌టీయూ ఖోఖో జట్టు విజేతలుగా నిలిచి ట్రోఫీలను కైవసం చేసుకున్నాయి. కబడ్డీ పోటీలో విద్యాజ్యోతి ఇంజనీరింగ్ కాలేజీ బాలుర జట్టు, బాలికల విభాగంలో ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఏరోనాటికల్ ఇంజనీరింగ్ బాలికల జట్టు ప్రథమ స్థానంలో నిలిచాయి. ఖోఖోలో రన్నరప్‌లుగా సీఎంఆర్‌ఐటీ బాలుర, సీఎంఆర్ టెక్నికల్ క్యాంపస్ బాలికల జట్లు, కబడ్డీలో ఎంఎల్‌ఆర్‌ఐటీ బాలుర, వీజేఐటీ బాలికల జట్లు రన్నరప్‌లుగా నిలిచాయి. విజేతలకు వర్సిటీ ఉన్నతాధికారులు, క్రీడా ప్రముఖులు, కూకట్‌పల్లి జోన్ పోలీసు అధికారుల చేతులమీదుగా బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు, కూకట్‌పల్లి ఏసీపీ శ్రీనివాసరావు, స్పోర్ట్స్ కౌన్సిల్ సెక్రటరీ దిలీప్, ఫిజికల్ డైరెక్టర్ అశోక్, సైబరాబాద్ బిల్డర్స్ అసోసియేషన్ సెక్రటరీ కేపీహెచ్‌బీ ఎస్సై శ్రీలత రెడ్డి తదితరులు పాల్గొన్నారు.